
సాక్షి
అనంతపురం
బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



టమాట కిలో రూ.23

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టం రూ.5, సరాసరి ధర రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
31.9°/17.1°

జిల్లా అంతటా మంగళవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి.

మాన్యం.. పరిటాల పరం

రాప్తాడులో ఆ దేవుని మాన్యం రూ.కోట్లు విలువ చేస్తుంది. దీనిపై పరిటాల కుటుంబం కన్ను పడింది. ఎలాగైనా ఆ భూమిని వేజిక్కించుకునేందుకు పన్నాగం పన్నింది. అతిథిగృహం నిర్మాణం కోసమని చెప్పి అనుమతులు రాకుండానే ఎకరం భూమిని స్వాధీనం చేసుకుంది. అతిథిగృహం స్థానంలో ఏకంగా టీడీపీ కార్యాలయం నిర్మించి.. పరిటాల భవన్ అని నామకరణం చేసింది.



రాప్తాడు వద్ద మాన్యం భూమిలో అక్రమంగా నిర్మించిన టీడీపీ కార్యాలయం

- ఆటోనగర్‌లో మిగులు భూమిపై కన్నేసిన టీడీపీ
- అతిథి గృహం కోసం భూమి కావాలని పంచాయతీ ద్వారా తీర్మానం
- ఏపీఐఐసీ అనుమతులు ఇవ్వకనే టీడీపీ కార్యాలయ భవన నిర్మాణం
- టీడీపీ హయాంలో బరితెగించిన పరిటాల కుటుంబం..

సాక్షి ప్రతినిధి, అనంతపురం: దేవుని మాన్యంలో టీడీపీ కార్యాలయం వెలసింది. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణం జరిగింది. పరిటాల కుటుంబం కనుసన్నల్లో ఇదంతా జరిగింది. రాప్తాడు గ్రామం కొత్త సర్వే నంబరు 554–2 (పాత సర్వే నంబరు 474)లో 33.44 ఎకరాల దేవదాయ శాఖ భూమిని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) గతంలో లీజుకు తీసుకుంది. ఈ భూమిని ఆటోనగర్ కార్మికులకు సబ్ లీజుకు ఏపీఐఐసీ కేటాయించింది. ఆటోనగర్ కార్మికుల కోసం కేటాయించిన భూమిలో మిగులుగా ఉన్న 1.02 ఎకరాలపై అప్పటి అధికార తెలుగుదేశం పార్టీ కన్నుపడింది. రూ.కోట్లు విలువ చేసే ఆ భూమిని తమపరం చేసుకునేందుకు పరిటాల కుటుంబం ప్రణాళిక రచించింది. ఇందులో భాగంగానే ఏపీఐఐసీ అధీనంలో ఉన్న ఈ భూమిలో 1.02 ఎకరాల భూమిని అతిథిగృహం కోసం కేటాయిస్తున్నట్లు.. దీనికి ఆమోదం తెలుపుతున్నట్లు 2016 ఆగస్టు 20న పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసింది.

అనుమతి ఇవ్వని ఏపీఐఐసీ

554–2 సర్వే నంబరులో మిగులుగా ఉన్న 1.02 ఎకరాల భూమిని తెలుగుదేశం పార్టీ అతిథిగృహం కోసం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడుగుతున్నారంటూ 2018 జనవరి 30న అప్పటి తహసీల్దార్ నాగభూషణం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు లేఖ రాశారు. ఇదివరకే గ్రామ పంచాయతీ కూడా తీర్మానం చేసిందని లేఖలో పేర్కొన్నారు. కానీ ఏపీఐఐసీ నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. ఇందుకు సంబంధించిన రికార్డులేవీ రాప్తాడు తహసీల్దార్ కార్యాయంలో లేవు. తహసీల్దార్ ఏపీఐఐసీకి రాసిన ఆర్‌సీ నంబరు 649/2016/ఏ–30– 01–2018 రెఫరెన్స్‌కు సంబంధించి గ్రీవెన్స్ పిటీషన్ల ఫైల్ ఉంది. దీన్నిబట్టి ఏపీఐఐసీకి రాసిన లేఖను ఆధారంగా చేసుకుని భూమిని దక్కించుకున్నారనేది స్పష్టమవుతోంది.

భవన నిర్మాణంపై మండల కన్వీనర్‌కు నోటీసులు

రాప్తాడు పంచాయతీ పరిధిలోని వేంకటరమణస్వామి దేవుని మాన్యానికి చెందిన 554–2 సర్వే నంబరులో ప్రజా ప్రయోజనార్థం ఏపీఐఐసీ సంస్థ కేటాయించిన భూమిలో అతిథిగృహం నిర్మించాలని పంచాయతీ తీర్మానిస్తే చట్టవిరుద్ధంగా, అక్రమంగా టీడీపీ కార్యాలయ భవనాన్ని ఎలా నిర్మిస్తారంటూ 2021 జనవరి 21న టీడీపీ మండల కన్వీనర్‌కు పంచాయతీ కార్యదర్శి నోటీసులు పంపారు. పై అధికారుల నుంచి అనుమతులు రాకుండానే పార్టీ భవనం నిర్మించడం ఏపీ పీఆర్ చట్టం 1994 సెక్షన్ 121 మేరకు చట్టవిరుద్ధమని నోటీసులో పేర్కొన్నారు. నోటీసు అందిన ఏడు రోజులలోగా అక్రమంగా నిర్మించిన భవనాన్ని పంచాయతీకి స్వాధీనం చేయాలని, లేదంటే చట్టపరమైన చర్యలుంటాయని స్పష్టం చేశారు. దీనిపై టీడీపీ మండల కన్వీనర్ కోర్టుకు వెళ్లాడు. ఈ భూమి పంచాయతీకి సంబంధం లేదంటూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. గతంలో నేమో ఇదే పంచాయతీ తీర్మానంతో భవనం నిర్మించారు.

మావద్ద రికార్డుల్లేవ్

554–2 సర్వే నంబరులో మిగులుగా ఉన్న 1.02 ఎకరాల భూమిని తెలుగుదేశం పార్టీ అతిథిగృహం కోసం అడిగారంటూ 2018 జనవరి 30న ఆర్‌సీ నంబరు 649/2016/ఏ–30–01– 2018 రెఫరెన్స్‌తో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన రికార్డులేవీ మా కార్యాలయంలో లేవు. 649/2016/ఏ రెఫరెన్స్ కింద గ్రీవెన్స్ పిటీషన్ల ఫైల్ మాత్రమే ఉంది.

– టి.లక్ష్మీనరసింహులు, ఇన్‌చార్జ్ తహసీల్దార్, రాప్తాడు

3న అనంతలో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత తదితరులు

అనంతపురం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల మూడో తేదీన అనంతపురంలోని కేఎస్ఎన్ బాలికల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహకారంతో నిర్వహించే ఈ జాబ్‌మేళాకు 15 బహుళజాతి కంపెనీలు రానున్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ పూర్తిచేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఉద్యోగానికి ఎంపికైన వారు పెనుకొండ, హిందూపురం, బెంగళూరు, హైదరాబాద్, అనంతపురంలో పని చేయాల్సి ఉంటుంది. ఉద్యోగ స్థాయిని బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం లభిస్తుంది. అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకుని ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు https://forms.gle/XzzCvRo5 MCXrwFC59 లింక్ ద్వారా రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440044121, 8317520929, 08554– 280936 నంబర్లలో సంప్రదించాలన్నారు. కాగా.. జాబ్‌మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అధికారులతో కలసి మంగళవారం తన నివాసంలో ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఉచిత బియ్యం పంపిణీ

అనంతపురం అర్బన్: జిల్లాలోని బియ్యం కార్డుదారులకు ఫిబ్రవరి నెలకు సంబంధించి బుధవారం నుంచి రేషన్ పంపిణీ చేస్తారని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. సరుకుల పంపిణీ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లు, సీఎస్‌డీటీలను ఆదేశించారు. కార్డులోని ప్రతి సభ్యునికీ 5 కిలోల చొప్పున, ఏఏవై కార్డుదారులకు మొత్తం 35 కిలోల చొప్పున పోషక విలువలు అధికంగా ఉన్న ఫోర్టిఫైడ్ బియ్యం ఉచితంగా ఇస్తారన్నారు. ఏఏవై కార్డుదారులకు చక్కెర కిలో రూ.13.50, మిగిలిన కార్డుదారులకు అరకిలో రూ.17తో ఇస్తారని వెల్లడించారు. కందిపప్పు కిలో రూ.67తో ఇస్తారన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారుల ఇళ్ల వద్దనే బియ్యం, సరుకులు పంపిణీ చేస్తారన్నారు.

గంజాయి కేసులో ముద్దాయికి శిక్ష

అనంతపురం: గంజాయి విక్రయ కేసులో ముద్దాయి బోయ ఓబుళపతికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ అనంతపురం మొదటి అదనపు జిల్లా జడ్జి రమేష్ సోమవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. 2019 అక్టోబర్ 11న అప్పటి ఉరవకొండ ఎస్‌ఐ తమకందిన సమాచారం మేరకు.. గవి మఠం పరిసరాల్లో సోదాలు చేయగా బోయ ఓబుళపతి వద్ద 700 గ్రాముల గంజాయి లభించింది. అతన్ని అదుపులో తీసుకుని విచారణ చేయగా కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు దగ్గర రూ.5వేలకు కొన్నానని, కొంత తన పెట్టెఅంగడిలో పెట్టి మిగిలిన దాన్ని సాధువులకు, లారీ డ్రైవర్లకు విక్రయించానని చెప్పాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. అప్పటి సీఐ వెంకటేశ్వర్లు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో భాగంగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణరెడ్డి ప్రాసిక్యూషన్ తరఫున ఐదుగురు సాక్షులను విచారించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఎస్.రమేష్ తీర్పు వెలువరించారు. బోయ ఓబుళపతిపై నేరం రుజువు కావడంతో ఏడాది కఠిన కారాగార శిక్ష, పది వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

'ఓపెన్' పరీక్ష ఫీజు చెల్లింపునకు 15 తుదిగడువు

అనంతపురం: ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించడానికి ఫిబ్రవరి 15 తుదిగడువుగా నిర్దేశించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద్ నాయక్ తెలిపారు. పదో తరగతి థియరీ ఒక సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియట్‌లో ఒక్కో సబ్జెక్టుకు రూ.250 చొప్పున చెల్లించాలని విద్యార్థులకు సూచించారు. మరిన్ని వివరాల కోసం https://apopenschool.ap. gov. in వెబ్‌సైట్ సందర్శించాలన్నారు.

క్రిమినల్ కేసులకు పరిష్కారం చూపాలి



ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా జడ్జి జి.శ్రీనివాస్

అనంతపురం: క్రిమినల్ కేసులు పరిష్కరించే దిశగా కృషి చేయాలని జిల్లా జడ్జి జి.శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి దీనబాబు ఆదేశాలు జారీ చేశారు. అనంతపురంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఫక్కీరప్ప, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, ఇతర పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు సింహభాగం పరిష్కరించాలని కోరారు.

సింహ వాహనంపై కొండమీద రాయుడు



బుక్కరాయసముద్రం: కొండమీదరాయుని బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి స్వామి వారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మండల కేంద్రంలోని పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఊరేగించారు. మహిళలు శ్రీవారికి మంగళహారతులు పట్టారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బుధవారం రాత్రి శ్రీవారిని శేష హనంపై ఊరేగించనున్నారు.

స్త్రీ నిధి దుర్వినియోగం



సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు (ఫైల్)

- వైకేపీ సిబ్బంది చేతివాటం..
- జిల్లాలో రూ.కోటికి పైగా నిధుల స్వాహా
- తాజాగా ఉరవకొండలోవెలుగులోకి
- విధుల నుంచి యానిమేటర్ తొలగింపు

అనంతపురం సెంట్రల్: కంచే చేను మేసిన చందంగా వైకేపీ సిబ్బంది 'స్త్రీ నిధి' సొమ్ము స్వాహా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.కోట్లలో నిధులు దుర్వినియోగమయ్యాయి. ఒక్కొక్కరు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల చొప్పున దారి మళ్లించారు. ఇప్పటికే 30 మంది వైకేపీ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. తాజాగా మంగళవారం ఉరవకొండ మండలంలో గంగ గ్రామైక్య సంఘానికి సంబంధించి దాదాపు రూ.7.50 లక్షల నిధులు దారి మళ్లించిన యానిమేటర్‌ను విధులు నుంచి తొలగిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పర్యవేక్షణ లేకే నిధులు పక్కదారి

స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు బ్యాంకుల తరహాలో ప్రభుత్వం స్త్రీ నిధి నుంచి రుణాలు మంజూరు చేస్తోంది. మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందేందుకు ఈ నిధులు దోహదపడతాయి. అయితే జిల్లాలో స్త్రీ నిధి రుణాలను కొన్నేళ్లుగా వైకేపీ సిబ్బంది పక్కదారి పట్టిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామ స్థాయిలో యానిమేటర్లు, సీసీలు సంయుక్తంగా నిధుల స్వాహాకు పాల్పడ్డారు. ముఖ్యంగా గుమ్మఘట్ట, బుక్కరాయసముద్రం, శింగనమల, ఉరవకొండ, గుంతకల్లు, పెద్దవడుగూరు, బెళుగుప్ప, కంబదూరు, కుందుర్పి తదితర మండలాల్లో భారీగా నిధులు దుర్వినియోగమైనట్లు తెలుస్తోంది. డ్వాక్రా మహిళలు సక్రమంగా కంతులు చెల్లిస్తుంటే సిబ్బంది మాత్రం ఆ మొత్తాన్ని బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకుంటున్నారు. ఒకరు చెల్లించిన మొత్తాన్ని మరొకరికి జమ చేస్తూ వస్తున్నారు.

రికవరీలో వెనుకబాటు

స్త్రీ నిధి రుణాల రికవరీలో జిల్లా వెనుకబడి ఉంది. రుణాలు తిరిగి చెల్లించని సంఘాలు ఎన్‌పీఏ (నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్)లోకి వెళ్తున్నాయి. భవిష్యత్‌లో ఆ సంఘాలు రుణాలు పొందే అవకాశాన్ని కోల్పోతున్నాయి. రుణాల రికవరీ అంశంలో ముందు నుంచి అధికారులు పెద్దగా శ్రద్ధ తీసుకోలేదు. కంబదూరు రూ.8.03 లక్షలు (98.19 శాతం), పెద్దవడుగూరు రూ.6.74 లక్షలు (70.04 శాతం), పెద్దవడుగూరు రూ.10.26 లక్షలు (64 శాతం), బ్రహ్మసముద్రం రూ.11.09 లక్షలు(46 శాతం), బెళుగుప్ప రూ.15.86 లక్షలు (44 శాతం), నార్పల రూ.19.56 లక్షలు (42 శాతం), రాయదుర్గం మండలంలో రూ.15.33 లక్షలు (41 శాతం) స్త్రీ నిధి రుణాలు తిరిగి చెల్లించకపోవడంతో మొండిబకాయిల జాబితాలో ముందువరుసలో నిలిచాయి. మొత్తం 2,716 స్వయం సహాయక సంఘాల మహిళల నుంచి రూ.2.82 కోట్లు తిరిగి రావాల్సి ఉంది. ఇందులో సగానికిపైగా నిధులు దారి మళ్లాయని, అందులో భాగంగానే రికవరీ కావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చర్యలు తీసుకుంటున్నాం

స్త్రీ నిధి రుణాల రికవరీపై దృష్టి సారించాం. గతంలో అనేక చోట్ల అవకతవకలు జరిగాయి. వాటన్నింటినీ సరిచేస్తున్నాం. మంగళవారం ఉరవకొండ మండలంలో యానిమేటర్‌పై చర్యలు తీసుకున్నాం.

– నరసింహారెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

మనోళ్లు 'శత'క్కొట్టారు

- అలరించిన ఆంధ్ర బ్యాటర్లు
- మూడు సెంచరీల నమోదు
- బిహార్‌పై 9 పరుగుల ఆధిక్యం



సెంచరీలు సాధించిన వంశీకృష్ణ, ధ్రువకుమార్‌రెడ్డి, కేఎస్ఎన్ రాజు

అనంతపురం సప్తగిరి సర్కిల్: బీసీసీఐ నేతృత్వంలో అనంత క్రీడాగ్రామం వేదికగా నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్ర బ్యాటర్లు చెలరేగారు. బిహార్‌పై తలపడిన ముగ్గురు బ్యాటర్లు ఏకంగా సెంచరీలు సాధించి రికార్డు సృష్టించారు. 189 పరుగులకు 4 వికెట్ల ఓవర్‌నైట్ స్కోరుతో ఇన్నింగ్స్‌ను ఆంధ్ర జట్టు ప్రారంభించింది. ఆంధ్ర బ్యాటర్లు వంశీకృష్ణ, ధ్రువకుమార్‌రెడ్డి, కేఎస్ఎన్ రాజు వరుసగా సెంచరీలు సాధించి జట్టుకు పటిష్ట స్కోరును అందించారు. 304 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్సర్‌తో వంశీకృష్ణ, 105 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో ధ్రువకుమార్‌రెడ్డి సెంచరీలు సాధించారు. అలాగే 173 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్సర్‌తో కేఎస్ఎన్ రాజు 102 పరుగులతో రాణించాడు. 143.1 ఓవర్ల వద్ద 418 పరుగులకు ఆంధ్ర జట్టు ఆలౌటైంది. బిహార్ బౌలర్లలో సాహిద్ 3, వికాస్ ఝా, మయాంక్ కుమార్, ఆమోద్‌యాదవ్ చెరో 2 వికెట్లు కూలదోశారు. తొలి ఇన్నింగ్స్‌లో 9 పరుగుల ఆధిక్యాన్ని ఆంధ్ర జట్టు సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన బిహార్ జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 21.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 70 పరుగులు సాధించింది.

'మత్తు' దుష్పరిణామాలపై అవగాహన





హాజరైన అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

అనంతపురం అర్బన్: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. మాదక ద్రవ్యాల నివారణ, పిల్లలను మత్తు పదార్థాలకు దూరం చేసే సంయుక్త కార్యాచరణ అమలుపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, మద్యం దుకాణాలు, మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు అమర్చి మత్తు పదార్థాలు వినియోగిస్తున్న 18 ఏళ్లలోపు వారిని గుర్తించాలన్నారు. సమాజంలో పోషించాల్సిన పాత్ర గురించి విద్యార్థులకు చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, మెప్మా పీడీ విజయలక్ష్మి, నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్య, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథచౌదరి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను తీవ్రంగా పరిగణించాలి

బాల్యవివాహాలను తీవ్రంగా పరిగణించాలని, ప్రోత్సహించిన తల్లిదండ్రులను బైండోవర్ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కిశోర బాలికల సాధికారత, బాల్యవివాహాల నివారణ అంశంపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలను ఆపడం వరకే బాధ్యతగా భావిస్తున్నారని, ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకు వెళ్లి బాల్య వివాహాలను జరిపిస్తున్న అంశాన్ని తీవ్రంగా పరిగణించడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందన్నారు. ఇకపై బాల్యవివాహాలు జరిపించే తల్లిదండ్రులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



బ్రోచర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తదితరులు

బుక్కరాయసముద్రం: రైతులకు లాభదాయకంగా ఉన్న చిరుధాన్యాల సాగును జగన్ సర్కారు ప్రోత్సహిస్తోందని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో మంగళవారం కిసాన్ మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే పద్మావతితో పాటు శాసనమండలి విప్ వెన్నపూస గోపాలరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ హాజరయ్యారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. పంటల సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి తేవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులకు సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ వల్ల పెట్టుబడులు తగ్గుతాయన్నారు. గిరిజమ్మ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వ్యవసాయం దండగ అంటూ రైతులను కించపరచగా.. ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని కొనియాడారు. అనంతరం స్టాళ్లను వారు పరిశీలించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ పంటల సాగుపై శాస్త్రవేత్తలు ముద్రించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యాన యూనివర్సిటీ బోర్డు సభ్యుడు కేశవరెడ్డి, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ ప్రశాంతి, సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, రేకులకుంట పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ సహదేవరెడ్డి, రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పద్మలత, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, వెటర్నరీ ఏడీలు డాక్టర్ రత్నకుమార్, డాక్టర్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, వైస్ ఎంపీపీలు జయలక్ష్మి, రామగోపాల్, సర్పంచ్ నరసమ్మ, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్యాకేజీకి తలొగ్గింది చంద్రబాబే

- బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ డియోధర్

అనంతపురం టవర్‌క్లాక్: విభజన అనంతరం ఏపీకి ప్రత్యేక హోదా బదులు ప్యాకేజీ కావాలని కోరుకుని తీసుకున్నది అప్పటి సీఎం చంద్రబాబు నేనని బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ డియోధర్ స్పష్టం చేశారు. మంగళవారం అనంతపురానికి విచ్చేసిన ఆయన స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు టీడీపీ నాయకులు నీచ రాజకీయలు చేస్తున్నారని, కుట్ర పూరితంగా బహిరంగ సభలు పెట్టి అమాయకుల ప్రాణాలు బలిగొన్నారని కుండ బద్దలుగొట్టారు. రాష్ట్రాభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ క్రమంలో పార్టీని అన్ని విధాలుగా పటిష్టం చేసే చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇందులో భాగంగా ఏపీలోని అన్ని జిల్లాలు, మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో బీజేపీ ఏపీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్దనరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చిరంజీవిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, న్యాయవాది రాఘవేంద్ర, నాయకులు దుద్దకుంట వెంటేశ్వరరెడ్డి, లలిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఇష్టం లేని పెళ్లి.. యువకుడి ఆత్మహత్య


మృతుడు కాశీం

గుత్తి: ఇష్టం లేని పెళ్లికి తలొగ్గలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి పట్టణంలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న మల్లేష్, లక్ష్మీదేవి దంపతుల ఏకైక కుమారుడు కాశీం (28)కు షోడాల షాపులో పనిచేస్తూ తండ్రికి చేదోడుగా ఉండేవాడు. కాశీంకు ఇటీవల వివాహం నిశ్చయమైంది. ఈ నెల 23, 24 తేదీల్లో పెళ్లి చేయాలని ఇరువైపులా పెద్దలు నిర్ణయించారు. అయితే కాశీంకు ఈ పెళ్లి ఇష్టం లేదు. ఇదే విషయాన్ని తన స్నేహితులతో చెప్పుకుని బాధపడ్డాడు. పెళ్లి నిశ్చియమైనప్పటి నుంచి ముభావంగా ఉంటూ వచ్చాడు. సోమవారం అర్ధరాత్రి 2 గంటల వరకూ సెల్‌ఫోన్ చూస్తూ స్నేహితులతో చాటింగ్ చేశాడు. మంగళవారం తెల్లవారుజామున ఇంట్లోని గదిలో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనతో ఎస్సీ కాలనీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎంతో మంచివాడుగా పేరున్న కాశీం ఆత్మహత్య చేసుకున్నాడని తెలుసుకున్న కాలనీ వాసులు పెద్ద ఎత్తున మృతుడి ఇంటి వద్దకు చేరుకున్నారు. మృతదేహంతో పాటు ఆస్పత్రికి చేరుకోవడంతో వైద్యశాల ప్రాంగణం కిక్కిరిసింది. ఏకైక కుమారుడి మృతితో తల్లిదండ్రులతో పాటు సోదరి రోదనలు మిన్నంటాయి. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సాఫ్ట్‌గా వ్యవసాయం

- పంటల సాగులో ఆధునిక సాంకేతికత
- సౌర శక్తితోనే 16 ఎకరాల్లో దానిమ్మ పంట
- నల్లరేగడిలోనూ బిందు సేద్యం!
- విడతల వారీగా దిగుబడులు వచ్చేలా ప్రణాళిక
- దళారుల ప్రమేయం లేకుండా పంట ఉత్పత్తుల విక్రయాలు
- ఆదర్శప్రాయంగా నిలిచిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ భువనేశ్వర చక్రవర్తి

శరీర కష్టం స్ఫురింపజేసే వ్యవసాయాన్ని తన మేథోశక్తితో చాలా నాజుకుగా మార్చేశాడు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఆడుతూ.. పాడుతూ.. శరీర కష్టమనేది తెలియకుండా పంటల సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. అంతేకాక పంట దిగుబడులను నేరుగా ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు చేపట్టి దళారీ వ్యవస్థకు మంగళం పాడాడు. సరికొత్త ఆలోచనతో వ్యవసాయాన్ని సుసంపన్నం చేసిన భువనేశ్వర చక్రవర్తి విజయ ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.


మార్కెట్‌కు తరలించేందుకు బాక్స్‌లలో నింపుతున్న దానిమ్మ పండ్లు


దానిమ్మ తోటలో ఫసల్ సాంకేతిక పరికరాన్ని చూపుతున్న భువనేశ్వర చక్రవర్తి

బెళుగుప్ప: మండలంలోని తగ్గుపర్తి గ్రామానికి చెందిన దబ్బర నారాయణస్వామి, నిర్మల దంపతుల కుమారుడు భువనేశ్వర చక్రవర్తి.. బెంగళూరులోని ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ప్రతి నెలా ఐదంకెల జీతం అందుకుంటున్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వర్క్‌ఫ్రమ్ విధానం ద్వారా ఇంటి వద్ద నుంచి పనిచేసే అవకాశం దక్కింది. ఈ క్రమంలో తగ్గుపర్తికి చేరుకున్న భువనేశ్వర చక్రవర్తి... పంటల సాగులో తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని కళ్లారా చూసి, చలించిపోయాడు. ఏదైనా చేసి శరీర కష్టం తెలియని వ్యవసాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని భావించాడు.

నల్లరేగడిలో పసిడి పంట

తమకున్న 16 ఎకరాల నల్లరేగడిలో సంప్రదాయ పంటలనే సాగు చేస్తూ నష్టాలను చవిచూస్తున్న తరుణంలో భువనేశ్వర ప్రసాద్ పంటల సాగుపై దృష్టి సారించాడు. అదే సమయంలో తండ్రి ఆకస్మిక మరణం ఆ కుటుంబాన్ని కుంగదీసింది. తీవ్ర వేదనలో ఉన్న తల్లి నిర్మలకు భువనేశ్వర్ అండగా ఉంటూ తనకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నల్లరేగడిలో బంగారు పంటలు పండించే మార్గాలను అన్వేషించాడు. ఆన్‌లైన్ అన్వేషణ ఫలించింది. మహారాష్ట్ర నుంచి భగువ రకం దానిమ్మ మొక్కలను తెప్పించి 2020లో ఆరు ఎకరాల్లో నాటాడు. విడతల వారీగా ఏడాది పొడవునా పంట దిగుబడి వచ్చేలా ప్రణాళిక రచించి మొత్తం 16 ఎకరాల్లో దానిమ్మ మొక్కలు నాటాడు. 2021లో 11 నెలలకే కాపు కాసిన దానిమ్మ పంట తొలి కాపులోనే ఆరు ఎకరాల్లో 26 టన్నుల దిగుబడి సాధించాడు. టన్ను రూ.60 వేలు నుంచి రూ.70 వేల వరకూ విక్రయించగా రూ.18 లక్షల ఆదాయం సమకూరింది. పెట్టుబడులకు రూ.4 లక్షలు పోను రూ.14 లక్షల నికర లాభం ఆర్జించాడు. అనంతరం ఆన్‌లైన్ యాప్‌ను రూపొందించి 2022లో మరో ఆరు ఎకరాల్లో కాపు కాసిన దానిమ్మను సొంతంగా బెంగళూరులోని పలు అపార్ట్‌మెంట్లలో నివాసముంటున్న వారికి సొంతంగా విక్రయించాడు. కిలో రూ.100 చొప్పున ఒక్కో అపార్ట్‌మెంట్‌కు వంద నుంచి 200 కిలోల వరకు బుక్ చేసుకుని ఐదు నుంచి పది కిలోల చొప్పున బాక్స్‌లను తోటలోనే ప్యాక్ చేయించి ఆర్టీసీ కార్గో సేవల ద్వారా బెంగళూరుకు తరలించేవాడు. రెండో విడత కాపులో 16 టన్నుల దిగుబడి సాధించి టన్ను రూ.90 వేల నుంచి రూ.1.10 లక్షల వరకూ విక్రయించాడు. ఈ లెక్కన రూ.16 లక్షల ఆదాయాన్ని గడించాడు. ఓ వైపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే మరో వైపు తల్లికి చేదోడుగా నిలిచి పది మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాడు.

సూర్యరశ్మిని ఒడిసిపట్టి

పంటల సాగుకు అవసరమైన నీటిని అందించేందుకు సంప్రదాయ విద్యుత్తును కాకుండా సౌరశక్తిపై భువనేశ్వర చక్రవర్తి ఆధారపడ్డాడు. సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుని సూర్యరశ్మిని ఒడిసిపట్టడం ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తుతో 16 ఎకరాల్లోని దానిమ్మ తోటకు బిందు సేద్యం ద్వారా నీటి తడులు అందిస్తూ వస్తున్నాడు. వన్యప్రాణుల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు రాత్రిళ్లు వివిధ రకాల శబ్దాలు వచ్చేలా తోటలో స్పీకర్లు అమర్చాడు. పంటను ఆశించే పండు ఈగలకు సోలార్‌లైట్‌తో ఎరలను ఏర్పాటు చేసాడు. దానిమ్మ పూలు మొత్తం ఫలదీకరణం చెందడానికి తోటలోనే తేనెటీగల పెంపకం చేపట్టాడు. దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన ఫసల్(ఎఫ్ఏఎస్ఏఎల్) యంత్రాన్ని రూ.50,000 ఖర్చుతో తోటలో అమర్చాడు. ఈ యంత్రానికి 13 రకాల సెన్సార్లు ఏర్పాటు చేసి శాటిలైట్ కనెక్టివిటితో వర్షసూచన, నేలలో తేమశాతం, పంటను ఆశించిన తెగుళ్లు, ఇతర సమాచారాన్ని తెలుసుకుంటున్నాడు.

ఏడాది మొత్తం దిగుబడే



వ్యవసాయ కూలీలతో పంటలో సస్యరక్షణ చర్యలు చేపడుతుంటాను. నా కుమారుడి ఆలోచన వల్ల ఏడాది పొడవునా దానిమ్మ పంట చేతికందుతోంది. గతంలో పంటసాగుకు చాలా కష్టపడేవాళ్లం. ఇప్పుడా శ్రమ లేకుండా పోయింది.
– నిర్మల, మహిళా రైతు, తగ్గుపర్తి

దళారీ వ్యవస్థ ఉండరాదు



పెద్ద కంపెనీలు సైతం దళారులతోనే పంట దిగుబడులను కొనుగోలు చేస్తున్నాయి. దీంతో పంట పండించిన రైతుకు కష్టం తప్ప ఆదాయం ఉండడం లేదు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం రైతు సంఘాలను ఏర్పాటు చేసి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలి. రైతులతో కంపెనీ ప్రతినిధులు నేరుగా సంప్రదించి పంట కొనుగోలు చేస్తే అన్నదాత కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుంది.
– భువనేశ్వర చక్రవర్తి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, తగ్గుపర్తి

గ్రామంలోనే ఉపాధి



భువనేశ్వర చక్రవర్తి సాగు చేసిన దానిమ్మ తోటలో నాతో పాటు మరో ఎనిమిది మంది కూలి పనులకు వెళుతుంటాం. ఏడాది పొడువునా మాకు పని ఉంటుంది. మా కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతోంది.
– ప్రసాద్, వ్యవసాయ కూలీ, తగ్గుపర్తి గ్రామం

రీసర్వే వేగవంతం చేయండి : జేసీ


భూముల రీ సర్వేపై అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

గార్లదిన్నె: జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. రాప్తాడు, అనంతపురం, పెద్దపప్పూరు, శింగనమల, తాడిపత్రి, గార్లదిన్నె, బ్రహ్మసముద్రం మండలాల్లో చేపట్టిన భూముల రీ సర్వే పురోగతిపై ఆయా మండలాల సర్వేయర్లు, డీటీలతో మంగళవారం గార్లదిన్నెలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. సర్వే సమయంలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి, భూమికి కచ్చితమైన కొలతలు చూపించాలన్నారు. రీ సర్వే చేపట్టిన భూమికి సంబంధించిన రైతులకు ముందుగా నోటీసులు జారీ చేసి, భూ సర్వేపై అవగాహన కల్పించి, సకాలంలో పని పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు అనువైన సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం గార్లదిన్నె పరిధిలోని సర్వే నంబర్ 95–1 పొలంలో చేపట్టిన ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ ఉషారాణి, సర్వే ఏడీ కిషోర్‌బాబు, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్లు చెన్నయ్య, వెంకటరత్న, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై సస్పెన్షన్ వేటు

అనంతపురం అర్బన్: అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలో ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తీవ్రంగా పరిగణించారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ముగ్గురు సచివాలయ ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓటరు సస్పెండైన వారిలో రుద్రంపేట గ్రేడ్–2 వీఆర్వో ప్రశాంత్ (పోలింగ్ బూత్–31), సచివాలయం–62 వార్డ్ ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శి హరికిషోర్ (పోలింగ్‌బూత్–63), రుద్రంపేట గ్రేడ్–2 వీఆర్వో రవితేజ (పోలింగ్ బూత్– 34) ఉన్నారు.


దేశీయ పశుజాతి పెంపే లక్ష్యం

- సెక్స్‌డ్ సార్టెడ్ సెమన్ ద్వారా 90 శాతం పెయ్యదూడలు


మాట్లాడుతున్న పశుశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డీఎల్‌డీఏ డాక్టర్ టి.సుధాకర్

అనంతపురం అగ్రికల్చర్: దేశీయ పశుజాతి ఉత్పత్తి పెంపు లక్ష్యంగా మేలుజాతి ఆంబోతుల వీర్యం ద్వారా కృత్రిమ గర్భోత్పత్తి కార్యక్రమం అమలు చేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ టి.సుధాకర్ తెలిపారు. మంగళవారం వారు క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రీయ గోకుల్‌మిషన్ కింద అమలు చేస్తున్న సెక్స్‌డ్ సార్టెడ్ సెమన్ (ఎస్ఎస్ఎస్) పథకం గురించి ఆరా తీశారు. గతంలో అమలు చేస్తున్న కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా సగం పెయ్య, సగం కుర్రదూడలు పుట్టేవన్నారు. అయితే కొత్తగా అందుబాటులోకి వచ్చిన సెమన్ ద్వారా కృత్రిమ గర్భోత్పత్తి చేస్తే... 90 శాతానికి పైగా పెయ్య దూడలే పుడతాయని రుజువైందన్నారు. ఈ క్రమంలో దీనిని పెద్ద ఎత్తున ప్రోత్సహించి సాధ్యమైనంత వరకు దేశీయ పశుజాతి సంతతిని అభివృద్ధిలోకి తీసుకురావాలని సూచించారు. రెండు డోసుల సెమన్ పూర్తి ఖరీదు రూ.1,350 కాగా అందులో రూ.850 సబ్సిడీ వర్తిస్తుందన్నారు. పాడి రైతులు తమ వాటా కింద రూ.500 చెల్లిస్తే రెండు డోసుల సెమన్ అందిస్తామన్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,400 డోసుల ద్వారా ఆవులు, గేదెల్లో కృత్రిమ గర్భోత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. లక్ష్యసాధనకు క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.

నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలి


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్ పర్సన్ లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఏడీసీసీ బ్యాంక్ సిబ్బందిని ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత ఆదేశించారు. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పాలక వర్గం సమావేశంలో ఆమె మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంకు వ్యాపార లావాదేవీల లక్ష్యం రూ.2 వేల కోట్లు కాగా, ఇప్పటి వరకూ రూ.1,500 కోట్ల లక్ష్యాన్ని చేరుకున్నట్లు వివరించారు. రాబోవు రెండు నెలల్లో రూ.500 కోట్ల లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. డిపాజిట్లపై అన్ని బ్యాంకుల కంటే అధికంగా 7.30 శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు 7.80 శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. అలాగే బంగారు నగల తాకట్టుపై గ్రాముకు రూ.3,800 చొప్పున అత్యధికంగా రుణాన్ని అతి తక్కువ వడ్డీకే అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించి బ్యాంక్ లావాదేవీలను పెంచాలని సూచించారు. పాలకవర్గ సభ్యులు శంకరరెడ్డి, రామాంజనేయులు, జనార్ధనరెడ్డి, ఈశ్వరరెడ్డి, బ్యాంక్ సీఈఓ రాంప్రసాద్, జనరల్ మేనేజర్ సురేఖ రాణి, సుఖదేవ్ బాబు, రవి కుమార్, లావణ్య పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రి నుంచి రోగి పరారీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి నుంచి రోగి పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనంతపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలను సీఐ శివరాముడు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా, పుట్టపర్తి మండలం పెడబల్లి గ్రామానికి చెందిన ఆనంద్‌ను చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు అనంతపురంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. లివర్ జబ్బుతో బాధపడుతున్న ఆనంద్‌ను పరామర్శించేందుకు వచ్చిన ఓ సమీప బంధువు మాటల్లో కొంత భాగం లివర్ తొలిగించే అవకాశాలుంటాయని అనుమానం వ్యక్తం చేశాడు. దీనిని నిజమని నమ్మిన ఆనంద్... సోమవారం రాత్రి బాత్‌రూమ్‌లోని కిటికీ అద్దాలు బద్ధలుగొట్టి అందులో నుంచి ఆస్పత్రి వెనుక ఉన్న వీధిలోకి చేరుకుని, ఉడాయించాడు. సోమవారం తెల్లవారుజామున ఆనంద్ కనిపించక పోవడంతో బాత్‌రూంలోకి వెళ్లి చూశారు. అద్దాలు పగిలి ఉండడం చూసి, తప్పించుకుని పారిపోయినట్లుగా నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, మంగళవారం సాయంత్రం 6 గంటలకు గోరంట్లలో తెలిసిన వారి ఇంటికి ఆనంద్ చేరుకున్నట్లు కుటుంబసభ్యులు గుర్తించారు. కేవలం లివర్‌లో కొంత భాగం తొలగిస్తారనే భయంతోనే ఆనంద్ ఆస్పత్రి వదిలి పారిపోయినట్లు విచారణలో తెలిసిందని సీఐ శివరాముడు వివరించారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం


చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

నార్పల: చిరుధాన్యాల ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చునని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని నార్పల మండలం హెచ్.సోదనపల్లిలో చిరుధాన్యాల సాగు, ఉపయోగాలపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే చిరుధాన్యాలు ఆహారంగా తప్పక తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల సాగుతో రైతులకు ఆశించిన మేర ఆదాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పూర్ణచంద్ర రావు, చంగల్‌రాయుడు, ఆత్మ పీడీ మద్దిలేటి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నాగలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ముగ్గురి ఎంపిక


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు


అనంతపురం సప్తగిరి సర్కిల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నంద్యాల వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 త్రోబాల్ పోటీల్లో రన్నరప్ స్థానాన్ని జిల్లా బాలికల జట్టు దక్కించుకుంది. టోర్నీలో అత్యంత ప్రతిభ కనబరచిన ముగ్గురిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో దివ్య, ఇందు, అంకిత ఉన్నారు. వీరిని ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్య, ఎస్జీఎఫ్ కార్యదర్శి రవికుమార్, కో–ఆర్డినేటర్ నాగరాజు అభినందించారు.

కమనీయం.. రుషీంద్రుల కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వేదమంత్రోచ్చారణల నడుమ భద్రావతి భావనా రుషీంద్రుల కల్యాణ మహోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. మార్కెట్‌వీధిలోని మార్కేండేయ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై ఉత్సవ మూర్తులను ప్రత్యేక పూలతో అలంకరించారు. ఉత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పద్మశాలీయ బహూత్తమ సంఘం అధ్యక్షుడు జక్కా చిన్న శింగరయ్య, ఉపాధ్యక్షులు జింకా రామంజినేయులు, గోలి నాగభూషణ, ప్రధాన కార్యదర్శి జింకా చిన్నప్ప, సహాయ కార్యదర్శి బోడగల శంకర్, కోశాధికారి పొరాళ్ల పుల్లయ్య, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేతిరెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వేలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తుల గ్రామోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. బుధవారం వసంతోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పూజల్లో మున్సిపల్ కౌన్సిలర్లు చందమూరి నారాయణ రెడ్డి, జయరామిరెడ్డి, పద్మశాలీయ బహూత్తమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు పురుషోత్తంరెడ్డి

ఉరవకొండ: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... వేల్పుమడుగు గ్రామానికి చెందిన పురుషోత్తం రెడ్డి (55) మంగళవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా మోళాపురం వద్ద బళ్లారికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన పురుషోత్తం రెడ్డిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

కేసు కొట్టివేత

హిందూపురం: కులదూషణపై బనాయించిన కేసును ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం న్యాయమూర్తి కొట్టి వేశారు. హిందూపురం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... తనను కులం పేరుతో దూషించారంటూ 2015లో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు శివ, ఆసీఫ్‌వుల్లా, నాగభూషణరెడ్డి, రజనీ, నాయకులు నాగమణి, బాలాజీ, అన్సర్, రామాంజిపై త్యాగరాజనగర్‌కు చెందిన టీడీపీ నేత వెంకటరమణ ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసు వాదనలు అనంతపురంలోని ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానంలో జరిగాయి. తొమ్మిది మంది సాక్షులను విచారణ చేశారు. సరైన సాక్ష్యాలు లేకపోవడంతో కేసును కొట్టి వేస్తూ న్యాయమూర్తి రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పు వెలువరించారు.

వైఎస్సార్‌ఈఏ నూతన కమిటీ ఎన్నిక


ఎంపికైన వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు

అనంతపురం క్రైం: వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (వైఎస్సార్‌ఈఏ) అనంతపురం ఆర్టీసీ డిపో నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపికైన వారిలో డిపో చైర్మన్‌గా పి.రామకృష్ణ, అధ్యక్షుడిగా జి.వెంకటేష్, కార్యదర్శిగా బి.సోమశేఖరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వీఎం కృష్ణ, సహాయ కార్యదర్శులుగా కె.నారాయణ, భీమలింగ, ప్రచార కార్యదర్శిగా ఎంవీ స్వామి ఉన్నారు. అలాగే రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం సుందర్రాజు, సభ్యుడిగా ఎం శివయ్యను ఎన్నుకున్నారు. ఎన్నికను రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌వీ భాస్కరరెడ్డి, గోపాల్ పరిశీలించారు.

బలిజపేటలో చోరీ

తలుపుల: మండల కేంద్రంలోని బలిజ పేటలో నివాసముంటున్న బి.కిషోర్‌కుమార్ ఇంట్లో సోమవారం రాత్రి దుండగులు చొరబడి నగదు, విలువైన సామగ్రి అపహరించుకెళ్లారు. కిషోర్‌కుమార్ ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి పెద్దన్నవారిపల్లికి వెళ్లాడు. విషయాన్ని గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.42 వేలు నగదు, 700 గ్రాముల వెండి ఆభరణాలు అపహించుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

రెండోరోజూ కేన్సర్ స్క్రీనింగ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రెండో రోజూ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్ష మంగళవారం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈనెల 4న ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వైద్యురాలు ప్రశాంతి మాట్లాడుతూ స్క్రీనింగ్ పరీక్షలకు మొత్తం 81 మంది హాజరయ్యారన్నారు. వారిలో 61 మందికి పీఏపీ సిమియర్ టెస్టులు చేసినట్లు తెలిపారు. వైద్యులు దినకర్, షంషాద్ బేగం, సంధ్య, విజయలక్ష్మి, శివశంకర్ నాయక్, పీజీ వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పరిరక్షించండి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పరిరక్షించాలని కేవీపీఎస్, ఎస్సీ,ఎస్టీ ప్రజా సంఘాల నాయకులు అనంతపురం రేంజ్ డిఐజీ ఎం.రవి ప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. మంగళవారం గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ డీఐజీని ఆయన చాంబర్‌లో కలిశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. ఈ చట్టం అమలుకు ప్రధాన బాధ్యతగా ఉండాల్సిన జిల్లా పోలీసులు చట్టం అమలులో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దళిత, గిరిజనులపై దాడులు జరిగినా ఫిర్యాదు తీసుకోవడంలేదన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ నల్లప్ప, దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు నెరమెట్ల ఎల్లన్న, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ తిరుపాల్, బాలపెద్దన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయ కుడు చిన్న పెద్దన్న, గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ పాల్గొన్నారు.

బాలోత్సవంలో సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ చైతన్య ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం: ఇటీవల అనంతపురంలో నిర్వహించిన బాలోత్సవం కార్యక్రమాల్లో శ్రీ చైతన్య విద్యా సంస్థ విద్యార్థులు పలు విభాగాల్లో సత్తా చాటారు. ప్రతిభ చాటిన విద్యార్థులను శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, డీన్‌లు శ్రీనివాస్ రెడ్డి, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇల్లు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురం అర్బన్: అర్హులందరికీ ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి, పక్కాగృహం నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ కోరారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట 30 గంటల సత్యాగ్రహం చేపడుతున్నామన్నారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యదర్శివర్గ సభ్యుడు నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్రకుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇళ్లు, ఇంటి స్థలాలు, పేదల కాలనీలకు ఇంటి పట్టాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో భూ కబ్జాలు పెరిగిపోయాయన్నారు. రాజీవ్‌కాలనీ, కొడిమి, ఉప్పరపల్లి పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు



స్టడీ అవర్స్‌ను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతి

అనంతపురం: ఇంటర్మీడియట్ కోర్సుల్లో విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అనంతపురం నగరంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో ప్రిన్సిపాల్ ప్రశాంతి , అధ్యాపకులు విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.ప్రభుత్వ కళాశాలలో ఈ తరహా శిక్షణ ఇవ్వడం ఇదే తొలిసారి. కళాశాలలో చదువుతున్న మొత్తం 200 మంది విద్యార్థులు స్టడీ అవర్స్‌కు హాజరుకాగా, వారందరికీ టీ, స్నాక్స్ అందించారు. అధ్యాపకుల పర్యవేక్షణలో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నామని ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ కేజే సిద్ధేశ్వర ప్రసాద్, ఫయాజ్ బాషా, వీరేష్, సంముఖాచారి, నారాయణ, అనిత తదితరులు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.

పుస్తకం తరాల మధ్య వారధి

అనంతపురం: ఒక మంచి పుస్తకం తరాల మధ్య వారధి అని ఎస్వీ డిగ్రీ , పీజీ కళాశాల వైస్ చైర్మన్ ఎస్.చక్రధర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎస్వీ డిగ్రీ , పీజీ కళాశాలలో 'మైక్రో బయాలజీ' అనే పుస్త కాన్ని చక్రధర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. మైక్రోబయాలజీ పుస్తక రచయితలు అయిన డాక్టర్ ఎండీ రఫీ, ఎం.కళ్యాణ చక్రవర్తిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీనివాసులు, ఏఓ ఏ సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో అన్ని వర్గాలకూ న్యాయం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రుద్రంపేట పంచాయతీలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామస్థాయికే పరిపాలన అందించి, పేదల సొంతింటి కల సాకారం చేస్తున్నారన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు.

చంద్రబాబు పాలనంతా మోసాలే :

టీడీపీ అధినేత చంద్రబాబు పాలనంతా అపద్ధాలు, మోసాలతో సాగిందని ఎమ్మెల్యే అన్నారు. 2014 ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకొచ్చిన చంద్రబాబు ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ఇప్పుడు తాను మళ్లీ అధికారంలోకొస్తే ప్రజలకు మేలు చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్ష నాయకులు ఎన్ని డ్రామాలాడినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీకి ప్రజలు అండగా నిలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. రుద్రంపేట పంచాయతీలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇంకా కొన్ని చోట్ల సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎంపీటీసీ మహబూబీ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోవిందరెడ్డి, కుళ్లాయప్ప, గౌస్‌బేగ్, సైపుల్లాబేగ్, శ్రీదేవి, పురుషోత్తం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు,తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మేలు మరువలేం

అనంతపురం క్రైం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న మేలు మరువలేమని మంగళవారికాలనీకి చెందిన పరంధామ అనే ఆటోడ్రైవర్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో ఆనందం పంచుకున్నారు. చేదోడు ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సాయం ఎంతో మేలు జరుగుతోందని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయీ బ్రాహ్మణులు కిష్ట, రాజు, పవన్‌కుమార్ ఎమ్మెల్యేతో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కేక్ కట్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నేత అనంత చంద్రారెడ్డి, నాయీబ్రాహ్మణులు క్షీరాభిషేకం చేశారు. మంగళవారం 35వ డివిజన్‌లోని మంగళవారి కాలనీలో ఎమ్మెల్యే అనంత గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కే రాధాతో కలసి మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిన మేలు ప్రజలకు వివరించారు. చేయూత, వసతి, విద్యాదీవెన ద్వారా వచ్చే డబ్బులతో బాబు చదువుకు ఉపయోగించుకుంటున్నామని, చాలా సంతోషంగా ఉందని పార్వతి అనే మహిళ ఎమ్మెల్యేతో తెలిపింది. అమ్మఒడి పథకం ఆదుకుందని మణి అనే మహిళ తెలిపింది. ఆలమూరులో తనకు ఇల్లు మంజూరైందని, ప్రభుత్వ మేలును మరువలేమని నగేష్ అనే వ్యక్తి తెలిపారు. వేలిముద్రలు పడకపోవడంతో రేషన్ ఇవ్వలేదని ఓసూరమ్మ అనే వృద్ధురాలు ఫిర్యాదు చేసింది. మంగళవారి కాలనీలోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న ఫోళ్లను మార్చాలని ఏఈ రవీంద్రప్రసాద్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, ఇస్సాక్, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, అనిల్‌కుమార్ గౌడ్, రామకృష్ణ, లోక్‌నాథ్ రెడ్డి, నరసింహులు, జావెద్, శ్రీదేవి, భారతి, గౌరి పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమ కాంతులు



యర్రగుంటలో లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గడప గడపలో సంక్షేమ కాంతులు వెదజల్లుతున్నాయని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని యర్రగుంటలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డితో కలిసి 'గడప గడపకూ మన ప్రభుత్వం ' నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. గడప గడపకూ వెళ్తుంటే మహిళలు ప్రభుత్వంపై కృతజ్ఞత తెలుపుకుంటున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు అనేక పాట్లు పడుతున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసగించిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. టీడీపీ హయాంలో బడుగు బలహీన వర్గాల వారిని విస్మరించారన్నారు. జగనన్న వారిని అక్కున చేర్చుకొని పెద్ద పీట వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారం పొందాలన్న కాంక్షతో టీడీపీ, ప్రతిపక్ష పార్టీలు గిమ్మిక్కులు చేస్తున్నాయన్నారు.

రైతుల కళ్లల్లో ఆనందం :

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి సకాలంలో వర్షాలు కురవడంతో భూగర్భజలాలు పెరిగి రైతుల కళ్లల్లో ఆనందం నిండిందని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలో ప్రతి చెరువుకూ నీళ్లు ఇచ్చామన్నారు. గతంలో 600 అడుగుల్లో నీళ్లు పడని ప్రాంతాల్లో ఇప్పుడు 200 అడుగుల్లోపే నీళ్లు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. నియోజకవర్గంలో అన్ని చెరువులతో పాటు పేరూరు డ్యాంకు నీటిని అందించడంతో రైతులు పూర్తి సంతృప్తిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, హౌసింగ్ ఏఈ దేవరకొండ రామ్మూర్తి, హెచ్‌ఓ రత్నకుమార్, ట్రాన్స్‌కో ఏఈ రమాదేవి, మరూరు సొసైటీ అధ్యక్షుడు కొండారెడ్డి, అగ్రిబోర్డ్ చైర్మన్ కేశవ రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పసుపుల నరసింహాగౌడ్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆదినారాయణ, సర్పంచు గొల్ల అరుణమ్మ, స్థానిక నాయకులు సుదర్శన్ రెడ్డి, పుల్లా రెడ్డి, నారాయణ రెడ్డి, రామ్మోహన్, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీలో అక్రిడిటేషన్ ప్రాసెస్‌పై వర్క్‌షాపు

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్ ఐటీ(అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఆధ్వర్యంలో నాక్ అసెస్మెంట్ ఫర్ అక్రిడిటేషన్ ప్రాసెస్‌పై మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. గుజరాత్ రాజ్‌కోట్ సౌరాష్ట్ర విశ్వ విద్యాలయం సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అతులగిరి మాయగిరి గొన్సాయ్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ సెల్ఫ్ స్టడీ రిపోర్ట్ ఎస్ఎస్ఆర్ డేటా వాలిడేషన్, వెరిఫికేషన్(డీవీవీ) స్టూడెంట్ (ఎస్ఎస్ఎస్) పీర్ టీం డేటా వ్యాలిడేషన్, వెరిఫికేషన్‌పై చర్చించారు. అన్ని ప్రమాణాల కోసం విశ్వవిద్యాలయాల్లో క్వాంటిటేటివ్ ప్రాసెస్‌పై తెలియజేశారు. గుణాత్మక కొలమానాలు, గ్రీక్ క్యాంపస్ కార్యక్రమాలు, న్యాక్ అక్రిడిటేషన్ కోసం అసెస్మెంట్ విధానం, మూల్యాంకన ప్రక్రియపై వివరించారు. న్యాక్ మూల్యాంకన ప్రక్రియపై అవగాహన కల్పించారు. ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి చైతన్య కిశోర్, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల విగ్రహాల ప్రతిష్ట



పూజలందుకున్న నాగ విగ్రహాలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్ రాజాహోటల్ ఎదురుగా నాగుల విగ్రహాల ప్రతిష్ట మంగళవారం వైభవంగా జరిగింది. వేకువజామున నుంచి నాగుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. హోమం, అశ్వర్థనారాయణస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. నాగుల విగ్రహాల ప్రతిష్ట విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కురుబ వెంకటేశ్వర్లు, శ్రీరాములు, నాగరాజు, సనత్‌కుమార్, కృష్ణమూర్తి ధన్యవాదాలు తెలిపారు.

పదవీ విరమణ తప్పనిసరి



ప్రొఫెసర్ వేణుగోపాల్ రావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి అని, విధి నిర్వహణలో వారు చేసిన సేవలు చిరస్మరణీయమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి అన్నారు. మంగళవారం అనంతరం వర్సిటీ భువన విజయంలో ఎంబీఏ విభాగం సీనియర్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు పదవీ విరమణ సభ ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ వేణుగోపాల్ రావు దంపతులను సన్మానించారు. అంతకుముందు ఎస్కేయూ ప్రధాన ద్వారం నుంచి ఆడిటోరియం వరకు ప్రొఫెసర్ వేణుగోపాల్ రావు దంపతులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, మాజీ వీసీ ప్రొఫెసర్ కాడా రామకృష్ణా రెడ్డి, మాజీ రిజిస్ట్రార్లు ప్రొఫెసర్ ఏవీ రమణ, ప్రొఫెసర్ కే సుధాకర్ బాబు, ప్రొఫెసర్ ప్రేమ్‌చంద్‌బాబు, మేనేజ్‌మెంట్ విభాగం డీన్ ప్రొఫెసర్ మురళీకృష్ణ, ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీఆర్ఐలో ఉద్యోగాల పంట



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

అనంతపురం: ఓటీపీఆర్ఐ (ఆయిల్ టెక్నాలజీ , ఫార్మసీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్)లో బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన 50 మంది విద్యార్థులకు బెంగళూర్ ఒమెగా మెడికల్ హెల్త్‌కేర్ కంపెనీలో ఉద్యోగాలు దక్కాయి. మంగళవారం జేఎన్‌టీయూఏ- ఓటీపీఆర్ఐలో ఒమెగా హెల్త్‌కేర్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో మొత్తం 92 మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పాల్గొనగా, 50 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ ఉద్యోగాలు దక్కిన విద్యార్థులను అభినందించారు. వరుసగా రెండో దఫా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి, విద్యార్థులకు ఉద్యోగాలు దక్కేలా చొరవ చూపిన ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ కృషి ప్రశంసనీయమని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఒమెగా మెడికల్ హెల్త్‌కేర్ కంపెనీ ప్రతినిధులు ఎం.మోహన్ కుమార్, ఓటీపీఆర్ఐ ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్లు మహేష్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర నాయకులు

అనంతపురం: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి. మురళీధర్ రావు అన్నారు. మంగళవారం నగరంలో అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని పురస్కరించుకొని ఏబీవీపీ జిల్లా మహాసభ నిర్వహించారు. గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పద్మ విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించి, ఆదిశగా కార్యాచరణ రూపొందించాలన్నారు. అనంతరం నగరంలో విద్యార్థులు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ ప్రాంత సంఘటన్ సుమన్, ప్రాంత వ్యవస్థ ప్రముఖ్ తిరుమల రెడ్డి, పెంచలయ్య, చిన్నా శ్రీరామ్, జాతీయ కార్యవర్గ సభ్యులు కవిత, జిల్లా కన్వీనర్ అఖిల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర కార్యసమితి సభ్యులు చెన్నయ్య, నగర అధ్యక్షుడు రామాంజనేయులు, నగర కార్యదర్శి శివతేజ పాల్గొన్నారు.

అందరూ విధుల్లో ఉండాల్సిందే

రాప్తాడురూరల్: ఎన్నికల విధుల్లో భాగంగా ఓటర్ కార్డుకు ఆధార్ లింకు, ఫొటో సిమిలర్ ఎంట్రీస్ కోసం నియమించిన బూత్‌లెవల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లందరూ విధుల్లో పాల్గొనాల్సిందేనని ఏ డిపార్ట్‌మెంట్ వారికి మినహాయింపు ఉండదని రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరసింహారెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం అనంతపురం ఎంపీడీఓ కార్యాలయంలో అనంతపురం రూరల్ మండల పరిధిలోని బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈఆర్‌ఓ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఆధార్‌లింక్, ఫొటో సిమిలర్ ఎంట్రీస్ ఫిబ్రవరి 15లోపు పూర్తి చేయాల్సిందేనన్నారు. తహసీల్దార్ శ్రీధరమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి లక్ష్యం పూర్తి చేయాలన్నారు. లేదంటే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ బాబా ఫకృద్దీన్, రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల డెప్యూటీ తహశీల్దార్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

సంక్షిప్త సమాచారం

పప్పుశనగ పంట కోత ప్రయోగాలు

ఆత్మకూరు: ముట్టాల సమీపంలో రబీ సీజన్ పప్పుశనగ పంట కోత ప్రయోగాలు మంగళవారం నిర్వహించారు. ఎకరం పంటలో నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని ఇన్‌చార్జ్ ఏఓ వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. పప్పుశనగ పంటకు మంచి డిమాండ్ ఉందని, సాగువిస్తీర్ణం పెరగాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ విజయ్‌కుమార్, ఏఎస్ఓ మమత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్రమోదక గణపతి హోమం

అనంతపురం కల్చరల్: నగర శివారులోని శారదా శృంగేరీ శంకర మఠంలో 28వ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. మంగళవారం మందిరంలోని ఆలయాల్లో అభిషేక, అలంకార సేవలు జరిగాయి. సహస్రమోదక గణపతి హోమాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిర్వాహకుడు ప్రసాద్ మాట్లాడుతూ బుధ, గురువారాల్లో వార్షికోత్సవ వేడుకలు వివిధ హోమాలతో జరుగుతాయన్నారు.

ముగిసిన జీఎన్‌ఎం ప్రవేశాల కౌన్సెలింగ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన జీఎన్‌ఎం ట్రైనింగ్ కోర్సు ప్రవేశాల భర్తీ కౌన్సెలింగ్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 585 సీట్లకుగాను 526 సీట్లు భర్తీ అయ్యాయి. వారికి అలాట్‌మెంట్ లెటర్లను అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, వైద్యాధికారులు సుజాత, ఏఓ ప్రభాకర్ మోజెస్, సిబ్బంది సురేష్‌కుమార్, కమలాకర్ రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ కే భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక సంస్థలో కార్మికుల, నాయకులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. 2010 నుంచి రావాల్సిన ఈపీఎఫ్, ఈఎస్ఐ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఈ నాగమోహన్, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, డీఈ రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టేషనరీ సరఫరాకు టెండర్లు

అనంతపురం సెంట్రల్: ఐసీడీఎస్ పరిధిలోని ప్రాజెక్టు కార్యాలయాలు, బాలసదనం, సేవాసదనాలకు ఈనెల 1 నుంచి ఏడాదికాలం పాటు స్టేషనరీ సరఫరాకు టెండర్లను ఆహ్వానించినట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి టెండర్లు ప్రాజెక్టు కార్యాలయంలో దాఖలు చేయాలని, టెండర్ల స్వీకరణకు 10వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు.15న టెండర్లు ప్రారంభిస్తారని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

అనంతపురం కల్చరల్: సంస్కార భారతి నేతృత్వంలో వచ్చేనెల 5న రాష్ట్రస్థాయి శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి తెలిపారు. భరతముని జయంతి సందర్భంగా విజయవాడలోని సంగీత నృత్య కళాశాల వేదికగా పోటీలు జరుగుతాయన్నారు. ఈనెల 3లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 9966716716740, 9573318258లో సంప్రదించాలని కోరారు.

బాలవిశ్వనాథశర్మ సేవలు చిరస్మరణీయం

అనంతపురం కల్చరల్: సంస్కృత పండితులుగా, త్యాగరాజ స్వామి ఆలయ వ్యవస్థాపకుడిగా బాలవిశ్వనాథ శర్మ పౌరోహిత, ఆధ్యాత్మిక రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు అన్నారు. బాలవిశ్వనాథశర్మ 8వ సంస్మరణ సభ మంగళవారం స్థానిక ప్రశాంతి నగర్‌లోని వేదమాత గాయత్రి ఆలయంలో జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న బాలవిశ్వనాథ శర్మ శిష్యబృందాలు సంస్మరణ సమావేశంలో పాల్గొన్నారు. ప్రముఖ సంస్కృత పండితులు జోస్యుల సదానంద శాస్త్రి , నిర్వాహకులు గరుడాద్రి సురేష్‌శర్మ, దేవరకొండ బాలాజీ శర్మ నేతృత్వంలో సదానంద శాస్త్రిని సత్కరించారు.

డీసీసీబీ ఏజీఎంకు సన్మానం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఏజీఎం కేఎస్ వీరభద్రప్రసాద్ మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక డీసీసీబీ హాలులో వీరభద్రప్రసాద్‌కు ఘనంగా వీడ్కోలు పలికి,, దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, సీఈవో ఏటీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, ఓఎస్‌డీ దినేష్‌కుమార్, డీజీఎం డి.సుఖదేవబాబు, యూనియన్ నాయకులు ఆర్‌వీ కృష్ణారెడ్డి, అనంతపద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి

- జలజీవన్ మిషన్ కింద తాగునీరు సరఫరా
- నీటి సమస్య పరిష్కారానికి రూ.54.11 కోట్లు



సింగంపల్లి తండాలో నీరు పట్టుకుంటున్న అనుషాబాయి

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే జలజీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించడానికి టెండర్లు పిలిచి, వెంటనే పనులు ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలోని 25 గ్రామాలకుగాను రూ.54.11 కోట్లు మంజూరయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్ తెలిపారు. మండలంలో (ఓహెచ్ఎస్ఆర్) ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వు ట్యాంకులు 20 మంజూరయినట్లు తెలిపారు. మండలంలో ప్రతి ఇంటికీ జల జీవన్‌మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి సగం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సగం నిధులు వచ్చాయన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి: ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో నీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. గత ప్రభుత్వంలో తాగునీటికోసం ఇబ్బందులు పడ్డారు. జల జీవన్ మిషన్ నిధులు రూ.54.11 కోట్లతో పైపులైన్ పనులు, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం పీఏబీఆర్ డ్యాం నుంచి ఆత్మకూరు మండలం వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు.మొదటి విడతలో రూ.3.70 కోట్లతో సింగంపల్లి తండా, కుర్లపల్లి, మదిగుబ్బ తండా, వేపచెర్ల ఎగువ తండా, దిగువ తండా, డీకే తండా, ఆత్మకూరులో పైపులైన్ పనులు, ఇంటింటికీ కుళాయి పనులు చేశారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి



నియోజకవర్గంలో ఎక్కడ నీటి సమస్య ఉందన్నమాట వినపడకుండా పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ముఖ్యంగా ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు పీఏబీఆర్ ద్వారా పైప్‌లైన్లు ఏర్పాటు చేయిస్తున్నాం. జల జీవన్‌మిషన్ కార్యక్రమంలో ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే

ఇక నీటి సమస్య ఉండదు



గత ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు నీటి ఎద్దడిని తీర్చలేదు. ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషితో, జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి, నీరు అందించేందుకు కృషి చేస్తున్నాం.

– హేమలత, ఎంపీపీ

టీడీపీకి భంగపాటు తప్పదు

- నగరపాలక సంస్థ మేయర్ వసీం

అనంతపురం క్రైం: టీడీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మరని, రాబోవు ఎన్నికల్లోనూ టీడీపీకి భంగపాటు తప్పదని మేయర్ వసీం అన్నారు. మంగళవారం నగరంలోని 38వ డివిజన్ (మేయర్ ప్రాతినిధ్యం వహించిన డివిజన్)లోని కోవూర్‌నగర్‌లో మేయర్ పర్యటించారు. ప్రజలకు అందుతున్న సేవలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పనితీరు, పారిశుధ్య నిర్వహణపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల పాదయాత్రలో టీడీపీ నేత లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని రక్షించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లారని టీడీపీ నేత లోకేష్ విమర్శలు చేయడం తగదన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా సీఎం ఢిల్లీకి వెళ్లారని, ఐటీ మంత్రిగా పని చేసిన ఆయనకు కనీసం అవగాహన లేదని మేయర్ వసీం లోకేష్‌పై మండిపడ్డారు. అధికారంలోకొచ్చాక మైనార్టీలకు ప్రాధాన్యతనిస్తామని ఆయన మాట్లాడుతున్నారని, గత ప్రభుత్వంలో ఏమి ఉద్ధరించారని ప్రశ్నించారు.